నిత్య వ్యాయామం, మంచి ఆహారంతో ఆరోగ్యం

మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కమాండెంట్ సన్నీ

కొండాపూర్, డిసెంబర్ 14 : నిత్య వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్ కమాండెంట్ సీ సన్నీ అన్నారు. గురువారం పోలీసు బెటాలియన్‌లో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ (ఏఐజీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా వ్యాయామాలు, మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. పూర్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులను సక్రమంగా నిర్వర్తించగలమన్నారు. వైద్య శిబిరంలో బెటాలియన్ ఉద్యోగులతో పాటు కుటుంబ సభ్యులు పలు రకాల వైద్య పరీక్షలను చేయించుకున్నారు. వైద్యులు పరీక్షల అనంతరం అవసరమైన సలహాలు, సూచనలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, ఏఐజీ దవాఖాన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గోపన్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బూత్‌కమిటీ సమావేశంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి, డిసెంబర్ 14: రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఏంతైనా ఉందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టి ఇన్‌చార్జి వీ.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బూత్‌కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుడిలా సేవలందించి శేరిలింగంపల్లిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు రాధకృష్ణ, రాజు, వెంకటేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో అంతర్జాతీయ దంత వర్క్‌షాప్

దంత వైద్య వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖులు

కొండాపూర్, డిసెంబర్ 14 : దంత వైద్యంలో అధునాతన టెక్నాలజీపై గురువారం హైటెక్‌సిటీలోని మెడికవర్ దవాఖానలో అంతర్జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. నగరంతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది దంత వైద్యులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. మెడికవర్ దవాఖానల క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శరత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. యూకేకు చెందిన డాక్టర్ మినాస్ లెవెన్స్కీ, డాక్టర్ జోహన్‌తో పాటు ఇతర దంత వైద్య నిపుణులు పాల్గొని నూతన టెక్నాలజీలను యువ వైద్యులకు వివరించారు. దంత ప్రక్రియలు, ఇంప్లాంటాలజీలో ఆక్సిజన్ థెరపీ వంటి వినూత్న విధానాలను క్లుప్తంగా వివరించారు.

కబ్జా నుంచి రేగులకుంట చెరువును కాపాడండి

కొండాపూర్, డిసెంబర్ 14 : చెరువుల కబ్జాను అడ్డుకుని అన్యక్రాంతమవుతున్న వాటిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలంటూ జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు రాజేంద్రనగర్ ఆర్డీఓ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, చందానగర్ డిప్యూటీ కమిషనర్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని చందానగర్ డివిజన్ దీప్తిశ్రీనగర్‌లోని రేగులకుంట చెరువు ఎఫ్‌టీఎల్ భూమిని దర్జాగా ఆక్రమించి అనుమతులు లేకుండా బోర్ వేసి నిర్మాణ పనులకు సిద్ధం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకుని సదరు స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఫిర్యాదు పేర్కొన్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు ఇచ్చిన సర్వే తప్పని, ఆర్డీఓ కార్యాలయం అధికారులు ధృవీకరించినట్లు తెలిపారు. చెరువును కాపాడి వెంటనే ఫెన్సింగ్‌ను నిర్మించాలంటూ ఆయన తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగు పడాలి: డీసీ

పారిశుధ్య విభాగంపై సమీక్ష నిర్వహిస్తున్న డీసీ వంశీకృష్ణ

మియాపూర్, డిసెంబర్ 14 : ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో సర్కిల్ పరిధిలో ఆయా విభాగాల సిబ్బంది తమ రోజు వారీ విధులపై మరింత శ్రద్ధతో పని చేయాలని చందానగర్ డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య పరిస్థితులు మరింతగా మెరుగు పడాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు, సిబ్బందితో గురువారం తన ఛాంబర్‌లో డీసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ వాణిజ్య, గృహ పరిసరాలలో పారిశుద్ధ్య విధులను మరింత సమర్థంగా నిర్వహించాలని, సకాలంలో క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. రహదారులను శుభ్రం చేయటం, ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు, వాహనాల ద్వారా డంప్ యార్డుకు తరలింపు అంతా పకడ్బందీగా జరగాలన్నారు. స్వచ్ఛ ఆటోలు విధిగా ఇండ్ల వద్దకు వెళ్లి చెత్త సేకరణను చేపట్టాలని, నిర్లక్ష్యం వద్దని డీసీ స్పష్టం చేశారు. రహదారులపై ఎక్కడాచెత్త కుప్పలు పేరుకుపోకుండా సంబంధిత పర్యవేక్షక అధికారులు సిబ్బందితో పని చేయించాలని డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, ఎస్ఎఫ్ఏలు, ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

హ్యాట్రిక్‌తో బాధ్యత మరింత పెరిగింది

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఘనంగా సన్మానించి వేదపండితల సమక్షంలో ఆశీర్వచనం చేస్తున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 14: ప్రజాశీర్వాదంతో శేరిలింగంపల్లిలో ఎమ్మెల్యేగా హ్యాట్రిక్‌తో బాధ్యత మరింత పెరిగిందని శేరిలింగంపల్లి శాసనసభ్యుడు అరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజగూడ సాయివైభవ్ కాలనీలో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, శ్యామలదేవి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి గెలవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ విజయం తన బాధ్యతను మరింత పెంచిందని అభివృద్ధి, సంక్షేమం ప్రధాన లక్ష్యంగా మెరుగైన సేవలందిస్తానన్నారు. మాజీ కార్పొరేటర్ కొమిరి శెట్టి సాయిబాబా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నీరుడి గణేశ్ ముదిరాజ్, సాయివైభవ్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, సెక్రటరీ పద్మావతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బోరబండ మెయిన్ రోడ్డు విస్తరణకు కసరత్తు షురూ

పరిశీలించిన బల్దియా అధికారి

బోరబండ మెయిన్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారి దిలీప్‌కుమార్

ఎర్రగడ్డ, డిసెంబర్ 14: బోరబండ మెయిన్ రోడ్డును విస్తరించటానికి బల్దియా కసరత్తును మొదలు పెట్టింది. ఇందులో భాగంగా రోడ్డు విస్తరణ విభాగం ఇన్‌చార్జి దిలీప్ కుమార్ గురువారం బోరబండ మెయిన్ రోడ్డును సిబ్బందితో కలిసి పరిశీలించారు. బోరబండ బస్ టెర్మినల్ చౌరస్తా నుంచి పాత పోలీస్ ఔట్‌పోస్ట్, స్వరాజ్‌నగర్, సైట్-2, పీలీ దర్గా మీదుగా సైట్-3 హైటెక్ హోటల్ వరకు ఇరుకుగా ఉన్న రహదారిని విస్తరించనున్నారు. సుమారు 1.5 కిలో మీటర్ల ఈ రహదారి విస్తరణ అంశం వాస్తవానికి 3 ఏండ్ల క్రితమే కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపాదించటం జరిగింది. విస్తరణలో భాగంగా రహదారికి ఇరువైపులా అస్తులను కోల్పోతున్న వాళ్ల సంఖ్య వందకు పైగానే ఉంటుంది. అందులో కొంత మందికి 3 ఏండ్ల క్రితం నష్ట పరిహారాన్ని బల్దియా అందజేయటం కూడా జరిగింది. కొన్ని అనివార్య కారణాల వల్ల మిగతా వాళ్లకు నష్ట పరిహారాన్ని బల్దియా అందించలేక పోయింది. దీంతో రోడ్డు విస్తరణ అంశం తాత్కాలికంగా బ్రేక్ పడింది. తాజాగా బోరబండ మెయిన్ రోడ్డు విస్తరణ విషయమై బల్దియాలో కదలిక మొదలైంది. విస్తరణలో భాగంగా ఆస్తులను కోల్పోతున్న వాళ్లలో గతంలో నష్ట పరిహారాన్ని అందుకున్న వారి వివరాలు.. నష్ట పరిహారాన్ని చెల్లించాల్సిన వారి వివరాలతో అధికారి దిలీప్‌కుమార్ పరిశీలించటం జరిగింది. వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని.. రోడ్డు విస్తరణ పనులను సాధ్యమైనంత త్వరగా చేపడతామని అధికారి పేర్కొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల

సమస్యల పరిష్కార వేదిక

కుత్బుల్లాపూర్,డిసెంబర్14: విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారుల గ్రీవెన్‌సెల్‌ను ఈ నెల 16న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు కుత్బుల్లాపూర్ విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డిఈ శ్రీనాథ్‌రెడ్డి, ఏఈడీ సత్యనారాయణలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, మెంబర్ కంజ్‌మర్ ఎఫైర్స్‌లు హాజరుకానున్నారని, దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

యూసుఫ్‌గూడలో..

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాల పర్యటన

జూబ్లీహిల్స్,డిసెంబర్14: యూసుఫ్‌గూడలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు పర్యటించాయి. జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్‌లోని వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ తదితర ప్రాంతాలలో ఆయా బృందాల ప్రతినిధులు పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, తడి-పొడి చెత్త సేకరణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 14: ముందు వెళ్తున్న ద్విచక్రవాహనంపై యువకుడిని వెనకాల నుండి అతివేగంతో దూసుకొచ్చిన లారీ ఢికొట్టిన సంఘటనలో యువకుడు అక్కడికక్కడే దుర్మరణపాలైన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మేడ్చల్ డబిల్‌పూర గ్రామానికి చెందిన ఉషంగారి వెంకటేశ్(34) గుండ్లపోచంపల్లిలోని ఓ ప్రైయివేట్ బ్యాంకులో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం ఇంటి నుండి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలోని కొంపల్లి బ్రిడ్జీ సమీపంలో ఉమామహేశ్వర ఆలయం వద్ద వెనకాల నుండి టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంతో దూసుకొచ్చి ఢికొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటేశ్ కింద పడడంతో అతని శరీరంపై నుండి వెనకాల టిప్పర్ లారీ టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చండీయాగం

చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠ పాలిత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో గురువారం శ్రీ సహస్ర రుద్ర సహిత చండీయాగం ఘనంగా నిర్వహించారు. యాగంతో పాటుగా ఆలయంలో తెల్లవారు జామున నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ పుణ్యాహవాచనము, పంచగవ్యప్రాసన దీక్షాధారణ గోపూజ, అఖండ దీపారాధన వాస్తుపూజ, వాస్తు హోమం, పర్యగ్నీకరణ, యాగశాల ప్రదక్షణ, కర్కశి కలశ స్థాపన, సింహదజారోహణ, అష్టదిక్పాలక పూజ, సప్తమాతృక పూజ, నవగ్రహ ఆరాధన, యోగినీగణ ఆరాధన, క్షేత్రపాలక ఆరాధన, మహాకాళి మహాలక్ష్మీ మహా సరస్వతి ప్రధాన కలశ స్థాపన ఆరాధన, చండీ నవావరణార్చనలను అర్చకులు సత్యసాయి పర్యవేక్షణలో పవన్‌కుమార్ శర్మ, మురళీధర శర్మలు వైభంగా నిర్వహించారు. - కొండాపూర్, డిసెంబర్ 14

తుల్జాభవానీ ఆలయంలో అయ్యప్ప పడిపూజ

తారానగర్ తుల్జాభవానీ ఆలయంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి, డిసెంబర్ 14: శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్ తుల్జాభవానీ ఆలయంలో బుయ్య మల్లేష్ గౌడ్ స్వామి అధ్వర్యంలో గురువారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లింగంపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యన్న మాలధరించిన స్వాములు పెద్ద ఎత్తున ఈ పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, వీరేశంగౌడ్, పాండు ముదిరాజ్‌లతో పాటు పలువురు నాయకులు, అయ్యప్ప స్వాములు ఈ పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.